

ఇందల్వాయిలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



మోపాల్‌లో..

# రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



డిచ్‌పల్లి మండల కేంద్రంలో..

డిచ్‌పల్లి/ ఇందల్వాయి/మోపాల్ (ఖలీల్‌వాడి), అక్టోబర్ 26 : రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం పంట సాయం పెట్టుబడి అందజేస్తుంటే.. ఓర్వలేని కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతుబంధును నిలిపివేయాలని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడాన్ని నిరసిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్‌ఎస్ నాయకులు గురువారం దహనం చేశారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలో సీనియర్ నాయకుడు శక్కరికొండ కృష్ణ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇందల్వాయి మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చిలువేరి గంగదాస్ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కు ఓటేస్తే ప్రజల పరిస్థితి అధ్వానంగా మారుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రమేశ్‌నాయక్, వైస్ ఎంపీపీ భూసాని అంజయ్య, రూరల్ ఎస్సీ కన్వీనర్ పాశం కుమార్, మండల ఉపాధ్యక్షులు బీరీశ్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు లోలం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. మోపాల్ మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మొచ్చ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.

## అయోధ్య బాలరాముడికి ఇందూరులో పూజలు

నిజామాబాద్ కల్చరల్, అక్టోబర్ 26 : అయోధ్యకు తరలిస్తున్న బాలరాముడి విగ్రహానికి ఇందూరు ప్రజలు గురువారం పూజలు చేశారు. జిల్లాకేంద్రంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న షిర్డీ సాయికృపానగర్ దత్తాశ్రమంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సద్గురుధామం ధార్మిక సేవాసంస్థ వ్యవస్థాపకుడు ఈప్పకాయల హరిదాసు స్వామి మాట్లాడతూ.. అయోధ్య రామాలయ నిర్మాణం చారిత్రాత్మకమైందని అన్నారు. దాన ధర్మ చారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా, ఆళ్లగడ్డలో బాలరామచంద్రుని విగ్రహాన్ని శిల్పులు తయారుచేశారని తెలిపారు. ఈ విగ్రహం కర్నూలు, హైదరాబాద్, కామారెడ్డి, నిజామాబాద్, ఆదిలాబాద్, నాగ్‌పూర్ మీదుగా వచ్చే నెల 22న అయోధ్యకు చేరుకుంటుందని తెలిపారు. అయోధ్యలో ప్రతిష్ఠించే బలరామచంద్రుడి విగ్రహం నగరానికి రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో దత్తమందిరం ప్రతినిధులు పాల్గొన్నారు.



ఇందూరుకు చేరుకున్న బాలరాముడి విగ్రహం

## నిబంధనలు అతిక్రమిస్తే కేసులు

శక్కర్‌నగర్/నవీపేట/బోధన్ రూరల్, అక్టోబర్ 26: నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పోలీసులు వాహనాల తనిఖీలు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. బోధన్‌లో పట్టణ సీఐ బీడీ ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం తనిఖీలు నిర్వహించారు. నవీపేట మండలంలోని యంచ చెక్‌పోస్టు వద్ద అధికారులు తనిఖీలను ముమ్మరం చేశారు. ఎస్సై యాదగిరిగౌడ్ అధ్వర్యంలో అధికారుల తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫ్లయింగ్ స్క్వాడ్స్ సయ్యద్ సాజీద్ అలీ, ఎక్సైజ్ సీఐ పోతారెడ్డి తదితరులు ఉన్నారు. సాలూర మండల కేంద్రంలోని మహారాష్ట్ర –తెలంగాణ సరిహద్దు వద్ద పోలీసులు వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రజల వద్ద రూ. 50 వేలకుపైగా డబ్బులు ఉంటే వాటికి సంబంధించి పత్రాలు ఉండాలని, లేకుంటే సీజ్ చేస్తామని పోలీసులు హెచ్చరించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మెండోరా, అక్టోబర్ 26: మండలంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై దూద్‌గాం కోతి దేవుడి ఆలయం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నడిమితండా గ్రామానికి చెందిన బానావత్ అనిల్(25) అనే యువకుడు మృతి చెందినట్లు ఎస్సై శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. అనిల్ స్కూటిపై నడిమితండా గ్రామం నుంచి నిర్మల్ వైపు వెళ్తున్నాడు. నిర్మల్ నుంచి ఆర్మూర్ వైపు వెళ్తున్న లారీ, ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో తీవ్ర గాయాల పాలైన అనిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బాల్కొండ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

# కలిగోట్‌లో సద్దుల సంబురం



కలిగోట్‌లో బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న మహిళలు

జక్రాన్‌పల్లి, అక్టోబర్ 26 : మండలంలోని కలిగోట్‌లో సద్దుల బతుకమ్మ వేడుకలను గురువారం నిర్వహించారు. గ్రామంలోని ఆడపడుచులు తీరొక్క పూలతో భారీ బతుకమ్మలను పేర్చి, ఇండ్ల ముందర ఉంచి పూజలు చేశారు. అనంతరం ప్రధాన కూడళ్ల వద్ద బతుకమ్మ పాటలతో సంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు. మహిళలు ఒకరినొకరు వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. బతుకమ్మ వేడుకలకు ముఖ్యఅతిథిగా రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ హాజరై సందడి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చేతనా విజయ్‌రెడ్డి, ఉపసర్పంచ్ రాజు, ఎంపీటీసీ జయ గిరిధర్‌గౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు చిన్న భోజన్న, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

## ఓటు హక్కును ధైర్యంగా వినియోగించుకోవాలి



ఆర్మూర్‌లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఆర్మూర్/ఆర్మూర్ టౌన్, అక్టోబర్26: ప్రజలు తమ ఓటు హక్కును ధైర్యంగా వినియోగించుకోవాలని జిల్లా పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ అన్నారు. వచ్చే నెలలో నిర్వహించనున్న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఓటరుకు తాము అండగా ఉంటామంటూ నినదిస్తూ సీపీ ఆధ్వర్యంలో పట్టణంలో పోలీసులు కవాతు నిర్వహించారు. పెర్కిట్ చౌరస్తా నుంచి మామిడిపల్లి, కొత్తబస్టాండ్, అంబేద్కర్ చౌరస్తా, పాత బస్టాండ్ మీదుగా హుస్నాబాద్ గల్లీ వరకు సీఏపీఎఫ్ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ... ఎన్నికలకు సంబంధించిన అవినీతిపై ఫిర్యాదులు, సమాచారం కోసం 100 లేదా 1950 నంబర్‌కు కాల్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఏసీపీ జగదీశ్ చందర్, ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సురేశ్‌బాబు, భీంగల్, ఆర్మూర్ రూరల్ సీఐలు, పోలీసు సిబ్బంది, కేంద్ర పోలీసులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ సిర్నాపల్లి గ్రామశాఖ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌గౌడ్

ఇందల్వాయి, అక్టోబర్ 26 : మండలంలోని సిర్నాపల్లి బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడిగా ఏర్గొండ శ్రీనివాస్‌గౌడ్‌ను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చిలువేరి గంగాదాస్ తెలిపారు. సర్పంచ్ తేలు విజయ్‌కుమార్, ఎంపీటీసీ అశ్విని శ్రీనివాస్, ఉపసర్పంచ్ నవీన్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్, నర్సయ్య, రమేశ్, యూసుఫ్‌అలీ, శ్రీకాంత్, షఫీ, మహ్మద్ పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో దుర్గామాత శోభాయాత్ర

కోటగిరి, అక్టోబర్ 26 : కోటగిరి, పొతంగల్‌లో దుర్గామాత శోభాయాత్రను గురువారం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తిపాటలకు యువతీ యువకులు సంప్రదాయ నృత్యం చేస్తూ శోభాయాత్రలో పాల్గొన్నారు. అనంతరం గ్రామ సమీపంలోని చెరువులో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

## దుర్గామాత విగ్రహ నిమజ్జనంలో అపశ్రుతి

- చెరువులో పడి యువకుడి మృతి

వర్ని, అక్టోబర్ 26 : దుర్గాదేవి విగ్రహ నిమజ్జనోత్సవంలో భాగంగా మండలంలోని పాత వర్నిలో అపశ్రుతి చోటు చేసుకున్నది. గురువారం తెల్లవారుజామున దేవీమాత విగ్రహాన్ని గ్రామశివారులోని చెరువులో నిమజ్జనం చేసేందుకు వెళ్లిన మంచిప్ప సాయికుమార్ (22) చెరువులో పడి మృతిచెందాడు. నిమజ్జనం చేస్తుండగా ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయిన సాయికుమార్‌ను రక్షించేందుకు అక్కడ ఉన్న వారు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఘటనాస్థలాన్ని వర్ని పోలీసులు పరిశీలించి పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు.

## బాధిత కుటుంబానికి చెక్కు అందజేత




చెక్కును అందజేస్తున సీపీ కల్మేశ్వర్

నిజామాబాద్ క్రైం, అక్టోబర్ 26 : నిజామాబాద్ పోలీస్ కంట్రోల్ రూంలో ఎస్సైగా విధులు నిర్వర్తించి రెండు నెలల క్రితం గుండెపోటుతో మరణించిన దయానంద్ కుటుంబానికి సీపీ కల్మేశ్వర్ గురువారం చెక్కును అందజేశారు. భద్రతా ఎక్స్‌గ్రేషియా రూపంలో వచ్చిన రూ.15 లక్షల 93 వేల 280 చెక్కును ఎస్సై సతీమణి మంజులకు అందజేశారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


## రేపు బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

వేల్పూర్, అక్టోబర్ 26: మండలంలోని లక్కోర ఏఎన్‌జీ ఫంక్షన్‌హాల్‌లో శనివారం నిర్వహించనున్న మండల స్థాయి కార్యకర్తల విస్తృత సమావేశానికి ప్రతి ఒక్కరూ తరలిరావాలని ఆర్టీఏ సభ్యుడు రేగుల రాములు, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ నాగధర్ అన్నారు. గురువారం మండలంలోని ఆయా గ్రామాల్లో పార్టీ బూత్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. 28న నిర్వహించే సమావేశానికి అన్ని గ్రామాల నుంచి ప్రతి కార్యకర్త తరలిరావాలని సూచించారు. ఈ సమావేశానికి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నాందేవ్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న సర్పంచ్ నిర్మల

భీమ్‌గల్, అక్టోబర్ 26: మండలంలోని రహత్‌నగర్‌కు చెందిన మలావత్ నాందేవ్ ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందగా మృతుడి భార్యకు సర్పంచ్ నిర్మల రూ.10వేల నగదును గురువారం అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ నాందేవ్ గ్రామపంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వహించేవాడని, ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామపంచాయతీ తరఫున ఆర్థిక సాయం అందించామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.